# కరుణామయి

రచన :
శ్రీ జక్కా రామచంద్ర

"అమ్మా ! ఆకలేస్తుంది....పట్టెడన్నముంటే పెట్టండి తల్లీ ! మిట్ట మధ్యాహ్నం, తల మండి పోతుందమ్మా ! కాళ్ళు కాలి పోతున్నాయమ్మా ! తల తిరిగి నిలువలేని పరిస్థితిలో వున్నానమ్మా ! అమ్మా ....తల్లీ !" అంటూ మొర పెట్టుకొంటున్న భిక్షగాడి పల్కులు అన్నపూర్ణ చెవిలో పడ్డాయి.

పాలు త్రాగుచున్న చంటివాడ్ని క్రింద పరుండబెట్టి, వంట గదిలోనికి వెళ్ళింది. అప్పుడే భర్తగారు భోజనం ముగించి ఆపీసుకు వెళ్ళారు. తను ఇంకనూ భోజనం చేయలేదు. చంటివాడికి పాలిచ్చి నిదురగొల్పి, ఆ తర్వాత భోంచేద్దామని తలంచినది. అంతలో భిక్షగాడి పిలుపు విని పాత్రలోవున్న అన్నమును తెల్లటి పింగాణి ప్లేటులోనికి తీసుకొని. అందులో చారు వేసి బాగుగా కలిపి బయటికి రావడానికి మూడు నిముషములు పట్టింది.

ఆకలి మంటలమధ్య విచక్షణ నశించిన భిక్షగాడు " 'అన్నపూర్ణ' అని వ్రాయబడ్డ ఇంటిలోకూడ అన్నమే కరువాయనా, దేవుడా !" అంటూ వెనుకడుగు వేయలేని స్థితిలో గోడకు అలాగే వొరుక్కొన్నాడు.

'అన్నపూర్ణ' అని ఇంగ్లీషులో వ్రాయబడినది. అదీ తెలుగులోనూ వ్రాయబడి యుండలేదు. పూటకు గతిలేని భిక్షగాడు చీలిక-చీలికలై, నూనెలో తడుపబడి కమురు గట్టి గబ్బువాసన కొట్టే బట్టలు ధరించినవాడు, వీపుకు అంటుకొని పోయిన డొక్క కలవాడు, నది వంపుల నడుముతో, పెరిగిపోయిన గడ్డముతో, వికారమైన వెంట్రుకలతో, చేత నూదకట్టను బట్టుకొనియున్న మనిషిని చూడగానే—'అన్నపూర్ణ' హృదయం ద్రవించి పోయినది.

"అయ్యా ! ఇటుగా రాగలవా ?" అంటూ అడిగింది అన్నపూర్ణ.

ఆ పిలుపులు భిక్షగానికి శ్రవణానందదాయకములైనవి. మంచు పర్వతాలలో నడచినంత చల్లదనం కలిగినది.

"అమ్మా....మహా తల్లీ ! దేశము గొడ్డు పోయిందని భ్రమించాను. కాని, దేశము గొడ్డు పోలేదని, అది గడ్డు పరిస్థితుల్లో చిక్కుకొని సుభిక్షానికి దారి వెదకుచున్నదని ఇప్పుడు గ్రహించాను. అమ్మా....నడువలేని పరిస్థితిలో వున్నాను. ఆకలి దప్పులమధ్య అల్లాడి పోతున్నాను. ఆ దివ్య ప్రసాదాన్ని యిక్కడే అందించు తల్లీ ! ఆరగించి సేద తీర్చుకొంటాను :" అని నోరు చప్పరిస్తూ, కన్నులు అమాంతంగా తెరుస్తూ చేతులు ముందుకు చాచాడు.

అన్నపూర్ణ అడుగు బయటికేసింది. కారు భగ్గుమని మండింది. మంటలై మండుతున్న భూమాతపై అధికమైన కోపం వచ్చినా....పరమ సాధ్వి అన్నపూర్ణ.

'ఆ మనిషి అలా వొరుక్కున్నాడే....అతని శరీరము కాలి బొబ్బలెక్కిందేమో ! ఆకలిమంటలే గాక ఆ మనిషి ఒళ్ళుకూడ దహించుకొని పోవుచున్నదే ! సాటి మనిషి సజీవ దహనం చూచి సాయం చేయని సహచరులెందు కీ లోకములో ? సాటిమనిషి నుద్ధరించలేని సమాజమెందు కీ జగతిలో ? అటు ప్రాణాలు విడువలేక, ఇటు ప్రాణాలు నిలువుకోలేక ఎందరు అభాగ్యు లీ విధంగా బాధ పడుతున్నారో గుర్తుకు తెచ్చుకొంటే - కష్టాలు తీరిపోవు. చేతనైన సాయం చేసినప్పుడే దానికొక పారమార్థికం లభించేలభించేద'ంటూ ముందుకెళ్ళి చేయూత నివ్వబోయింది అన్నపూర్ణ.

"అమ్మా ! నన్ను తాక వద్దు. ఏడేడు పధ్నాలుగు జన్మాల దరిద్రమును మూట గట్టుకొని మోస్తూ తిరిగేవాణ్ణి. మూడు పొద్దు కొక పొద్దైన పట్టెడు మెతుకులు తినడానికి నోచుకోని దౌర్భాగ్యుణ్ణి. పది మందికి పట్టెడన్నము పెట్టి ఆదరించే మహా తల్లివి. నీవు బాగుంటే నా లాంటి అభాగ్యుల కొక్క పూటయిన పట్టెడన్నము దొరకుతుంది. అన్నం పెట్టి, ఆదరించే పవిత్ర మూర్తివమ్మా ! గబ్బు కొట్టే నా ఒళ్ళుతో ఆ చేతులు అపవిత్రము కాకూడదమ్మా ! అందుకే తల్లి నన్ను తాకవద్దని కోరుచున్నాను. అదియునుగాక కందిపోగు లాంటి నీ పాదాలను, కాలే ఎఱ్ఱటి బండలు కాల్చి వేస్తాయమ్మా ! తల్లీ....త్వరగా నీవు లోపలి కెళ్ళమ్మా !" అంటూ ప్రాధేయ పడ్డాడు భిక్షగాడు.

అంతటి నికృష్ట జీవితములోకూడ పరుల బాధలను గుర్తించే ఆ మనిషి చాల గొప్పవాడని గ్రహించింది అన్నపూర్ణ. వలదని వారించినా "అయ్యా ! మనుష్యులకుండవలసినది మానవత్వము. కాని అంటరానితనము, హేయ భావము కాదయ్యా ! భగ్గుమని మండే ఎఱ్ఱటి ఎండలో నువ్వింతగా మండి మాడిపోతుంటే చూస్తూ వెళ్ళిపోవడానికి నాది గుండె కాని, బండ కాదు. కష్టాలలో కాలాన్ని పంచుకున్న వాడే పరమయోగి. నువ్వెవరయితే నాకేమి కావాలి ? నా దారి నాది అనేవాడు కురూపి. విక్ర

'ఎస్' బీడీల ఎగుమతి




కెనడా, స్విడ్జర్లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్స్. ఎ. హబీబీర్ రహమాన్ అండ్ సన్సు గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు. అనేక ఇంటర్నేషనల్ పైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్ పైర్) స్వీడన్, బెల్జియం, సింగపూర్ మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాలలో కూడా వీటిని ప్రవేశపెట్టారు. 'ఎస్' బీడీలకు వారు తయారుచేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టెవంటి పాకెట్లో కొత్త రూపు, అందచందాలు కూడా ఏర్పడ్డాయి.

ఆద్యంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బీడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది ప్రాచ్య ప్రాశ్చాత్య దేశాలలో. లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.

ష్టుడు. నువ్వు కష్టాలతోనే గాక, ఆకలి మంటలమధ్య గిల-గిల లాడుతున్న నీ ప్రాణానికి పేద తీర్చడం సాటి మనిషిగా నా ధర్మం !'' అంటూ అతన్ని మెల్లగా లేవదీసి లోపలికి తీసుకెళ్లుతూ పడసాలిలో అడుగు పెట్టింది. చంటి వాడి అరుపులు చెవులలో గిర్రుమన్నాయి.

'అమ్మా! ఎంతటి దయాశాలివమ్మా! నా ఆకలిదప్పులు తీర్చడాని కోసం, తొమ్మిది నెలలు మోసి కన్నబిడ్డనే మరిచిపోయావా? నా కిలాంటి ఆదరణ వద్దు తల్లీ! నీ చల్లని చేతులు తాకకానే నా ఆకలి పటాపంచలై పోయినది. నా కడుపు చల్లగా మారిపోయినది. అమ్మా.... మొదట చంటిబాబుకు పాలిచ్చి కడుపు నింపుతల్లీ!'' అని కరుణతో కరిగిపోయాడు భిక్షగాడు.

అతని ప్రవర్తనలో అలవికాని అనురాగం, ప్రీతి వాత్సల్యం ఉన్నత స్థాయికి చెందినవని గ్రహించింది. చంటివాడిని చంకనెత్తుకోగానే ఏడుపులాపి, కిల-కిల నవ్వ సాగాడు. చెంబునిండా నీళ్లు తెచ్చి భిక్షగాడి చేతులకు పోసింది. ఆకు వేసి అన్నం పెట్టింది. ఎదురుగా కూర్చొని చంటివాడికి పాలివ్వడం మొదలు పెట్టింది.

''అమ్మా! నీ మాటలే నా కడుపును నింపివేశాయి తల్లీ! నీ చల్లని చూపులే నా దప్పికను తీర్చివేశాయి తల్లీ! అమ్మా.... ఎన్ని జన్మలెత్తినా నీ రుణం తీర్చుకోలేనమ్మా!'' అంటూ ఆనంద బాష్పాలు రాల్చాడు భిక్షగాడు.

''అయ్యా! భోజనం చేయు సమయంతో ఎక్కువగా మాట్లాడకూడదని పెద్దలంటారు. భోజనం చేశాక నీ యిష్టం వచ్చిన రీతిలో మాట్లాడు. ఆ తరువాత భోజనం పెట్టినందుకు సార్థకం నాకు లభిస్తుంది.'' అని అన్నపూర్ణ భిక్షగాడితో వినయంగా పల్కింది.

ఎంతో దగ్గరి బంధువులోనూ, మిత్రునిలోనూ, ఆప్తుడిలోనూ ఇంతటి ఆప్యాయత, అనురాగం కనిపించదు. తానొక భిక్షగాడినని తెలిసికూడ తన్ను ఇంతగా ఆదరించిన ఈమె సామాన్య స్త్రీ కాదు. భగవంతుని సృష్టిలో ఒక ప్రత్యేక సృష్టి - అని మనస్సులో తలంచి భోజనం ముగించుకొని అన్నపూర్ణ వైపు చూచాడు.

''అమ్మా! నాకు మరో జన్మనిచ్చిన కరుణామయి అయినావు తల్లీ! అలాంటి తల్లిని వదలి వెళ్ళడానికి....!''

''అయ్యా! భిక్షగాళ్ళెందరో నా యింటి ముందుకు వచ్చారు. పెట్టింది తిని వెళ్ళిపోయారు. కాని వారిని నేనేమియు అడుగనూ లేదు. వాళ్ళుకూడ నన్నేమియు పలుకరించనూ లేదు. కాని నిన్ను చూశాక ఒకటడగాలని ఉంది.

అందుకు తగిన సమాధానమిస్తే, నాకు నీవు కృతఘ్నుడి వవుతావు. లేదంటే....'' అని నిరాశగా చూచింది.

''అమ్మా! కృతఘ్నత నా జన్మ హక్కు. అయినా పగిలిపోయిన మూగటి పట్టుకొని పది యిండ్లు తిరిగే నా లాంటి భిక్షగాడు మీరడిగే దానికి తగిన సమాధానం యివ్వ గల సమర్థుడా తల్లీ!''

''అయ్యా! పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది, చాలా పరిమళిస్తుంది. పరిమళించినప్పుడే ఆ పువ్వును ఏ గుడిలోనో, ఏ మేడిలోనో కూర్చుండ బెడతారు. ఆ గడువు తీరాక ఏ చెత్త బుట్టలోనో పారేస్తుంటారు. మాణిక్యం మట్టిలో పుట్టి మహారాజు కిరీటంలో నిలుస్తుంది. మహారాజు కిరీటంలో ఉన్నంతకాలం తన వెలుగుతో దేశాన్ని వెలిగింప జేస్తుంది. కారణాంతరాల వల్ల కిరీటం నుండి తీసి ఏ బురద గుంటలోనో, ఏ మసిగుడ్డలోనో దాచబడినప్పుడు మాణిక్యం వెలుగు ఏమవుతుంది? అలాంటిదే జీవితము కూడ. చీకటి వెలుగులు జీవిత రహదారులు. అలాంటి మాణిక్యమే నువ్వని నేను గ్రహించాను. పుట్టుకతో నీవు భిక్షగాడు కాలేదు, శ్రీమంతుడివై పుట్టావు. చివరకు భిక్షగాడివయ్యావు. ఇందులో నేను తప్పుగా ఆలోచించి వుంటే క్షమించు!'' అని అడిగింది అన్నపూర్ణ.

''అమ్మా! ఏ శాస్త్ర పారంగతులు తెలుసుకోలేని నగ్న సత్యాన్ని తెలుసుకొన్న నీవు సామాన్యురాలివి కాదమ్మా! నేను గ్రహించినట్టుగా నీవు ఆ కరుణామయియే నమ్మా! అమ్మా....నేను చెప్పవలసిన విషయాలు అటే గ్రహించినావు తల్లీ! నేను చెప్పవలసిన దింకేదియు లేదు. నీవు ఊహించినది తప్పు అని నేనెలా అనగలను తల్లీ! అయినా 'గతః-గతః' అంటారు. జరిగిపోయిన దానికి చింతించ నవసరము లేదని. అమ్మా మీ లాంటి మహనీయు లున్నందు వలననే, నా లాంటి మానవనీయులు బ్రతుకు చున్నారు. పది మందికి పాలు పంచి యిచ్చిన ఈ చేతులలో పాపవు పట్టెడన్నము పడకూడదని ఇన్నాళ్ళుగ దేవుడు విధాయించినాడమ్మా! అందుకే ఇన్ని రోజులుగా ఎవ్వరి చేతులనుండి సంపూర్ణమైనటువంటి భోజనం అందచేయ లేదు భగవంతుడు. అమ్మా....కాలం ఇబ్బందులు పెట్టడం, పవిత్రత కోసమేనని తెలుసుకొన్నాను. ఇలాంటి తల్లులను ఒక గ్రామానికి ఒక్కరినయినా దేవుడు ప్రసాదించితే ఎందరో అనాదుల ఆకలిదప్పులు తీరుతాయి. అమ్మా! నాకు భోజనం పెట్టావన్న అభిమానముతో నేను పలికే పలుకులు ఈ జన్మలో తీరదేమో! కాని వచ్చే జన్మలో మీ రుణం తీర్చుకొంటానమ్మా! తల్లీ....వెళ్ళి రానా!'' అని వినయంగా అడిగాడు.


"SELEKT"
Motors
and
Pumps

ISI
IS325



For:– EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE



Manufactured by :
CHITRA INDUSTRIES
COIMBATORE – 641 005.
Grams : "SELEKT PUMP" Phone : 44543

: సేల్స్ బ్రాంచ్ :

చిత్రా యిండస్ట్రీస్
5-1-446, రాణిగంజ్
సికిందరాబాద్-3 (ఎ. పి.) ఫోన్: 77828

డిస్ట్రిబ్యూటర్స్ :

లక్ష్మి ఏజెన్సీస్
రాణిగంజ్ : : సికిందరాబాద్-3.

"అయ్యా! ఎక్కడికి వెళ్ళుతారు ?"

"అమ్మా, ఎక్కడికి వెళ్ళుతారని తెలియకనే అడుగుతారా ? భిక్షగాడికి ఒక ఊరా....ఒక భోజనమా....? ప్రపంచమంతా....మాదే తల్లీ! పంచభక్ష్య పరమాన్నాదులన్నీ మాకేనమ్మా ! ఎక్కడికైనా వెళ్ళవచ్చు. తన ప్రాణాన్నే పణంగా ఒడ్డి స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టిన బాపూజీ కలలు గన్న మన భారతదేశంలో భిక్షగాళ్ళకు భయమేముంది తల్లీ; ఆ మహాత్ముని పేరు చెప్పుకొని, చెప్పులకు వుంగటాలు అతికించే అల్పుల ప్రభుత్వములో మా బాగోగులు చర్చించే వారెవరమ్మా ? అలాంటి నికృష్టుల చేతుల మీదుగా ఈ కాలం నడువలేదు తల్లీ! మీలాంటి కన్నతల్లుల కనుసన్నల వెలుగుతో, ఈ కాలం రేయింబవళ్ళతో నడుస్తున్నది. లేనిచో ప్రళయకాల ప్రభంజనములలో ఈ కలికాలమంతరించి వుండెడిది. అమ్మా! ఏదో ఆవేశములో ఏదేదో మాట్లాడినాను. తప్పులుంటే మన్నించు!" అన్నాడు భిక్షగాడు.

"అయ్యా! నువ్వన్నది అక్షరాలా నిజం. మన గురించి మనం బాగుపడ్డప్పుడే దేశాన్ని గురించి చర్చించాలి. అయినా నేను చెప్పినట్లు చేయగలిగితే, ఈ దేశాన్నుద్ధరించినంత ఘనత నీకు దక్కుతుంది. ఆ ఘనత నీకు లభించినప్పుడే నా మనస్సుకు శాంతి. అంతవరకూ నాలో అశాంతి చేరువై వుంటుంది.

"అమ్మా! నీలో అశాంతి చోటు చేసుకోడానికి వీల్లేదు. నీవు చెప్పినట్లు చేయడంలో నా కెలాంటి అభ్యంతరము లేదు. సెలవీయండి తల్లీ!" అంటూ తల వంచి నిలుచుకొన్నాడు.

"అయ్యా! అక్కడ కనిపించే మంగలిషాపు కెళ్ళి— "అమ్మగారు పంపించారు, కటింగ్ కోసం!" అని చెప్పమంది.

"అమ్మా! ఇంతవరకూ ఎందరెందరో మంగలి మహనీయుల కాళ్ళు బట్టుకొని అడుక్కున్నాను. వారి కాళ్ళు దెబ్బలు తప్ప నా తలభారము తగ్గినది కాదు తల్లీ! దరిద్రం కన్నా మరే కఠిన శిక్ష మనిషికి లేదని గుర్తించి, మరల అలాంటి వారి ముఖం చూడకూడదని నిశ్చయించుకున్నాను. అయినా మీరు వెళ్ళమంటున్నారు. వెళ్ళి వస్తానమ్మా!", అంటూ భిక్షగాడు షాపు వైపుకు ప్రయాణం కట్టాడు.

"అయ్యా....బాబుగారూ! తల పెరిగిపోయింది. గడ్డం గబురులు కట్టింది. దయయుంచి ఈ కర్మను తొలగించి పుణ్యము కట్టుకో"మని—వింతగా పలుకుతున్న వారెవరని లోపలినుండి వెలుపలికి చూచి, "అయ్యో....భిక్షగాడు! అడుక్కునే రీతికూడ మార్చేసుకొని, మరీ మర్యాదగా అడుగుతున్నాడు."

"అయ్యా....బాబుగారూ! మాకు తీరిక లేదు, మరో అంగడి దగ్గటి కెళ్ళ"మన్నాడు షాపువాడు.

"ఎక్కడికెళ్ళినా ఇంకొక అంగడి అంటే, ఆ అంగడి ఎక్కడుందని వెదుకను బాబూ! దయతో నన్ను చూడు బాబూ!"


మేలైన పొగాకులతో, అత్యుత్తమమైన ఆకులతో, నిపుణులైన పనివారులచే తయారు చేస్తున్నాము.

卐

మల్లీస్సేరి బీడీలు

卐

అత్యుత్తమమైనదని లక్షలాది ప్రజలు వాడుతున్నారు.




Grams : "Mallisseri" Phone : 24031

**Mallisseri Beedi Works**

SULLIVAN STREET, COIMBATORE - 641 001.

Regd. No.
6233




Phone :
21852

* కలర్ బనియన్లు, * డోరియా, * జెట్టీలు.

''అయ్యా! మనిషికి ఒక మాట....పశువుకు ఒక దెబ్బ అంటారు. వెళ్ళిపోతావా? లేక వెళ్ళించమంటావా....?''

''సర్లే, బాబూ! అమ్మగారితో ఆ మాటే చెప్పుతాను.'' అంటూ అడుగు వెనుకకు వేశాడు.

''ఏ అమ్మగారితో....'' తత్తరపాటుగా అడిగాడు.

''అదిగో చూడు....అక్కడ కనిపించే ఆ మహాతల్లి అన్నపూర్ణమ్మగారు.''

''అయ్యా! ఆ విషయం మొదటే చెప్పలేకపోయావా? రా....త్వరగా! లోపలికి రా?'' అంటూ పోస్తున్న చెమటలను తుడుచుకొంటూ కుర్చీపైన కూర్చుండబెట్టాడు.

''దేవుడికన్నా డబ్బే గురువంటారు నాయనా!'' అంటూ అద్దంలో తన వికార స్వరూపాన్ని చూచుకొని తనలో తాను నవ్వుకొన్నాడు. భరించ లేనటువంటి బాధతో. ఆ బాధను మరపింపజేయడానికేమో నిద్ర ముంచుకొచ్చింది.

''అయ్యా! మీరిక లేచి పక్కన స్నానం చేసే గది వుంది. వెళ్ళి స్నానం చేయం''డని, వినయంగా లోపలికి తీసుకెళ్ళి చూపించాడు.

భిక్షగాడు తనివితీరా స్నానం చేసి, టవలు కట్టుకొని వెలుపలికి రాగానే తెల్లపంచె, తెల్లచొక్కా చేతికందించాడొక కుర్రవాడు. బట్టలు వేసికొని కుర్రవాడి జతలో బయల్దేరి వస్తున్నాడు. మబ్బుతెరలు తొలగిన చంద్రబింబమయ్యాడు. లోపలికి తీసుకెళ్ళి మంచం వేసి కొద్దిసేపలా పరుండమని తాను లోపలికి వెళ్ళింది.

ఎవరికి ఎవరో ఈ లోకంలో....అయితే అందరికీ అందరూ ఈ లోకంలో....మనిషిలో మమకారం, మంచితనం, మాట విలువ నిండివుంటే ఆ మనిషి సగౌరవముగా ఎందరినో తనవారిగా చేసుకొంటాడు. అంధకార బంధురమైన ఎందరో జీవితాలలో వెలుగును నింపి మేలుకొలుపుతాడు. ఆ మేలుకొలుపే దేవుడు ప్రసాదించిన కరుణ అనే సాధనం ఆ సాధనాన్ని వినియోగించిన వారే ఆ సాధనాన్ని పొందిన వారే కరుణామయులు. అలాంటి కరుణామయులలో యీ కరుణామయి అన్నపూర్ణమ్మ. అతను మామూలు భిక్షగాడని వదలి వేయలేదు. అతనిలో ఉన్న విద్యలు ప్రాధాన్యమిచ్చింది. అతనిలో నిద్రబోవుచున్న నైతిక శక్తిని మేలుకొలిపింది. అతనొక ఎం. ఎ. పట్టము పొందిన విద్యావంతుడని తెలుసుకుంది. ఉద్యోగం కోసం అతను పడ్డ అగచాట్లు కొన్ని నూర్ల పుటలకు స్థలము చాలకొస్తుంది. మనిషి మనిషిగా బ్రతకలేనప్పుడు ఎంతటి శ్రీమంతునికైనా ఏది మూలం తప్పదు. శ్రీమంతుల కొడుకే. శ్రీమంతుల యజమానుడే. ఏమి ప్రయోజనం? ఉన్న ఆస్తులు అప్పుల పాలు ఉన్నవారి బాగోగులు ఉరికంభాలే. ఎవరిని ఆదరిస్తాడు? ఎవరికి సమాధానమిస్తాడు? అందరినీ వదిలాడు. మానవత్వం అంతరించింది. ఆత్మహత్య మహా పాపమని తలంచినాడు. బలమున్నంతవరకు కూలి పనులు చేశాడు. కూటికికూడ గడ్డు పరిస్థితి. కష్టించిన ఫలితం శూన్యం. ముప్పై ఐదు సంవత్సరాలు ముగింపు కాకనే భారతదేశానికి పట్టుకొమ్మైన యువ రక్తము యింకిపోయి భిక్షాటనకు మొదలు పెట్టింది. ఆకలి మహా చెడ్డది. దాన్ని చంపుకోలేని పరిస్థితుల్లో అది మరొక్కరిని చంపుతుంది. ఆకలి కోసం భిక్షగాడిగా మారిన ఆ శ్రీమంతుల మనిషిని చేరదీసి, భర్తగారి చేతినుండొక ఉద్యోగం సంపాయించి పెట్టింది కరుణామయి అన్నపూర్ణ.